క్లుప్తంగా

కేంద్ర బలగాల కవాతు



పెదకలవలాపల్లిలో కేంద్ర బలగాలు, పోలీసులు కవాతు

రాంబిల్లి: సార్వత్రిక ఎన్నికలు సజావుగా సాగేందుకు అందరూ సహకరించాలని సీఐ ఎస్. లక్ష్మణరావు కోరారు. మండలంలో మంగళవారం పెదకలవలాపల్లి, రాంబిల్లి, వాడనర్సాపురం, కొత్తపట్నం గ్రామాల్లో కేంద్ర బలగాలు, పోలీసులు సంయుక్తంగా కవాతు నిర్వహించారు. ఆయుధాలు చేతబూని కవాతు నిర్వహించారు. ఎటువంటి అక్రమాలు, హింస, తగాదాలు జోలికి పోకుండా స్వేచ్ఛగా ఓటుహక్కును అందరూ వినియోగించుకోవాలని సీఐ కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం అని అటువంటి ఓటు హక్కును ధైర్యంగా వినియోగించుకోవాలన్నారు.

26న పోలిపల్లి అమ్మవారి పండగ

మునగపాక : గవర్ల అనకాపల్లి గ్రామంలో ఈ నెల 26న పోలిపల్లి అమ్మవారి పండగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ చైర్మన్ బుద్ధ రవిశంకర్ తెలిపారు. ఉదయం నుంచి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అదే రోజు ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన జరుగుతుందన్నారు. అనకాపల్లి మండలం వల్లూరు కళాకారులతో కోలాటం ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. అదే రోజు సాయంత్రం అమ్మవారి ఘటాలతో ఊరేగింపు ఉంటుందన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని రవి శంకర్ కోరుతున్నారు.

రెండోరోజు ప్రశాంతం

కోటవురట్ల: పదో తరగతి పరీక్షలు రెండో రోజు ప్రశాంతంగా జరిగాయి. స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 369 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా తాగునీరు, మందులు అందుబాటులో ఉంచారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పర్యవేక్షిస్తున్నారు. పరీక్ష కేంద్రాల పరిసరాలలోకి ఎవరూ రాకుండా కాపలా కాస్తున్నారు.

చెత్త తొలగింపు

రాంబిల్లి : అప్పారాయుడుపాలెంలో మంగళవారం సుందరపు లోవరాజు తన సొంత సొమ్ముతో చెత్తను తొలగించారు. పొక్లెయిన్, ట్రాక్టరు సాయంతో చెత్తా చెదారాన్ని తొలగించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు లోవరాజు పేర్కొన్నారు.

కనకమహాలక్ష్మి అమ్మవారి తీర్థ మహోత్సవం నేడు



కశింకోట: మండలంలోని బయ్యవరంలో కనకమహాలక్ష్మి అమ్మవారి తీర్థ మహోత్సవం బుధవారం పెద్ద ఎత్తున నిర్వహించేందుకు సన్నాహాలు చేసినట్లు మార్కెట్ కమిటీ అధ్యక్షుడు, ఆలయ కమిటీ వ్యవస్థాపక చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ గొల్లవిల్లి జయ మంగళవారం తెలిపారు. ఉత్సవంలో భాగంగా అమ్మవారిని పూలతో అలంకరించి ఉదయం 6 గంటల నుంచి ప్రత్యేక కుంకుమార్చనలు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన ఉంటుందన్నారు. సాయంత్రం కోలాటాలు, భజనలు, తప్పెటగుళ్లు, సాంస్కృతిక కార్యక్రమాలతో తీర్థ మహోత్సవం ఉత్సాహంగా జరగనుందన్నారు.

వాకర్స్ క్లబ్ అధ్యక్షుడిగా సత్యనారాయణ

అనకాపల్లి: స్థానిక వాకర్స్ క్లబ్ నూతన అధ్యక్షునిగా ఏరుబండి సత్యనారాయణ ఎన్నికయ్యారు. మండలంలోని తుమ్మపాల గ్రామంలో మంగళవారం వాకర్స్ క్లబ్ సమావేశం జరిగింది. ఇటీవల మరణించిన క్లబ్ అధ్యక్షుడు రామ అప్పారావు చిత్ర పటానికి తొలుత నివాళి అర్పించారు. అనంతరం క్లబ్ ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా సత్యనారాయణ, కార్యదర్శిగా మత్తుర్తి ఉమామహేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ సమాజానికి ఉపయోగపడే పనులు చేయడంలో వాకర్స్ క్లబ్ ఎప్పుడూ ముందుంటుందన్నారు. పిల్లా హర శ్రీనివాసరావు, కోన అప్పారావులు ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

పోదాం పద యాత్ర..

ఉపమాక వెంకన్న జాతర



విద్యుద్దీపాల అలంకరణతో జాతరకు సిద్ధమైన ఉపమాక వెంకన్న ఆలయం



భక్తుల దర్శనాల కోసం ఏర్పాటు చేసిన షామియానాలు, షెడ్లు

- వెంకన్న సన్నిధికి చేరుకుంటున్న భక్త జనం
- నేటి రాత్రికి జాతర, స్వామికల్యాణం
- తెల్లవారుజామున 2 గంటల నుంచే దర్శనాలు ప్రారంభం

నక్కపల్లి : దారులన్నీ ఉపమాక వైపు మళ్లాయ్...పోదాం..పద యాత్ర...ఉపమాక వెంకన్న జాతర... అంటూ వెంకన్న కల్యాణాన్ని తిలకించేందుకు భక్తజనకోటి తరలివస్తున్నారు. ఉపమాక శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణం బుధవారం రాత్రి నేత్ర పర్వంగా జరగనుంది. ప్రతి ఏటా ఫాల్గుణ శుద్ధ ఏకాదశి నాడు కోనేటి రాయుని కల్యాణం వేదమంత్రోచ్చారణలు, భక్తుల హర్షధ్వానాల నడుమ జరుగుతుంది. శుక్రవారం వేకువ జాము నుంచే వెంకన్న ఆలయం భక్తకోటితో కిక్కిరిసి పోతుంది. సంతానం లేని వారు ఇక్కడ ఉన్న ధ్వజస్తంభానికి పూజలు నిర్వహించి, ఆలింగనం చేసుకునేందుకు పోటీ పడతారు. ఏకాదశి లగాయతు ఉగాది వరకు ఇక్కడ పెద్ద ఎత్తున జాతర (తీర్థం) జరుగుతుంది.

టీటీడీ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు

ఉత్సవాలు తిలకించేందుకు వచ్చే భక్తుల కోసం టీటీడీ భారీ ఏర్పాట్లు చేసింది. ప్రత్యేక క్యూకాంప్లెక్స్‌లు, షెడ్లు, విద్యుద్దీపాలంకరణలు చేశారు. వారం రోజుల పాటు టీటీడీ వారు ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. ఉపమాక పరిసర ప్రాంతాలనుంచి తప్పెటగుళ్లు, తోడపెద్దు సంబరాలు నిర్వహించేందుకు ప్రత్యేక బందాలు వస్తున్నాయి. బుధవారం ఉదయం ప్రారంభమైన జాతర గురువారం మధ్యాహ్నం వరకు కొనసాగుతుంది. ఈ ఉత్సవాలకు హాజరయ్యే భక్తులందరికీ ఏకాదశి రోజున వివిధ సేవా సంఘాల వారు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నారు. నక్కపల్లి సత్య సాయి సేవాసమితి సభ్యులు భక్తులకు ఉచితంగా మంచినీరు, మజ్జిగ సరఫరా, హెటెరో ఎంప్లాయీస్ యూనియన్ వారు అన్న సమారాధన నిర్వహిస్తున్నారు. తలనీలాలు సమర్పించుకునే భక్తుల కోసం టీటీడీ ప్రత్యేక క్యూకాంప్లెక్స్‌లు నిర్మించింది. వృద్ధులు, చంటి పిల్లల కోసం ఉచితంగా పాలు సరఫరా చేస్తోంది.

జల్లికట్టు స్నానానికి ఏర్పాట్లు

బందుర సరస్సు వద్ద స్నాన ఘట్టాలు, మహిళల కోసం ప్రత్యేక మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. స్వామివారి పుష్కరిణిలో జల్లికట్టు స్నానాలకు ఏర్పాట్లు చేశారు. భక్తులు చెరువులోపలికి వెళ్లకుండా 50 అడుగుల మేర రేకుతో ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. ఈ మధ్యలోనే స్నానాలకు షవర్లు ఏర్పాటు చేశారు.

పటిష్ట బందోబస్తు

జిల్లా ఎస్పీ మురళీకృష్ణ ఏర్పాట్లపై సోమవారం సమీక్ష జరిపారు. నక్కపల్లి, అడ్డురోడ్డు, పాయకరావుపేట సీఐలు విజయ్‌కుమార్, అప్పన్న, అప్పలరాజు ఆధ్వర్యంలో సుమారు 200 మంది పోలీసు సిబ్బంది బందోబస్తు కోసం వచ్చారు. మఫ్టీలో కూడా పోలీసులు విధులు నిర్వహిస్తారు.

తిమ్మరాజుపేటలో నేడు వైఎస్సార్‌సీపీ కార్యాలయం ప్రారంభం



తిమ్మరాజుపేటలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం

మునగపాక : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మండలంలోని తిమ్మరాజుపేటలో బుధవారం వైఎస్సార్‌సీపీ కార్యాలయం ప్రారంభించనున్నట్లు ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్ తెలిపారు. మెయిన్ రోడ్డును ఆనుకొని పార్టీ కార్యకర్తలకు అందుబాటులో ఉండేలా కార్యాలయం ఏర్పాటు చేశారు. కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు ఉదయం 9 గంటలకు హాజరుకావాలని జగన్ కోరారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి



రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న ఈఆర్‌వో మనోరమ

యలమంచిలి : ప్రశాంత ఎన్నికలకు అందరూ సహకరించాలని యలమంచిలి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి మనోరమ అన్నారు.మంగళవారం యలమంచిలి తహసీల్దారు కార్యాలయంలో నియోజకవర్గ రాజకీయ పార్టీ నాయకులు, అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఎన్నికల ప్రవర్తన నియమావళిని అనుసరించి నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని అధికారులు, రాజకీయ నాయకులకు పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో అభ్యర్థులు వివాదస్పద వ్యాఖ్యలు చేయరాదని సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని, ఎటువంటి విద్వేషాలు లేకుండా అధికారులకు సహకరించాలని రాజకీయపార్టీల నాయకులను కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయపార్టీల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

పారిపల్లెమ్మ అమ్మవారికి జలాభిషేకం



బిందెలతో జలం తీసుకువెళుతున్న భక్తులు

మునగపాక : మండలంలోని వాడ్రాపల్లి పారిపల్లెమ్మ అమ్మవారి విగ్రహానికి మంగళవారం జలాభిషేకం చేశారు. ఈనెల 26న జరగనున్న పండగలో భాగంగా వాడ్రాపల్లి ఆవలోని నీటిని సేకరించి బిందెలతో ఆలయానికి ఊరేగింపుగా వచ్చారు. సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు ఇతర పెద్దలంతా కార్యక్రమంలో పాల్గొన్నారు.

స్టేషన్‌రోడ్డు నాణ్యత తనిఖీ



రైల్వే స్టేషన్‌రోడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న వీఎంఆర్‌డీఏ క్వాలిటీ కంట్రోల్ సెల్ ఇంజినీర్లు

యలమంచిలి రూరల్ : పట్టణంలోని రూ.2.20కోట్ల నిధులతో నిర్మిస్తున్న రైల్వే స్టేషన్‌రోడ్డు (సీసీ రోడ్డు) నాణ్యతను వీఎంఆర్‌డీఏ క్వాలిటీ కంట్రోల్ సెల్ ఇంజినీర్లు మంగళవారం సాయంత్రం తనిఖీ చేశారు. 14 మీటర్ల వెడల్పు, 650 మీటర్ల పొడవున చేపడుతున్న ఈ రహదారి విస్తరణ పనులు నిబంధనల ప్రకారం నిర్మిస్తున్నారో లేదో పరిశీలించారు. రహదారి మందం, పొడవు, వెడల్పులకు కొలతలు తీశారు. రహదారి నాణ్యతను తనిఖీ చేసిన ఇంజినీర్లు సంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటికి 70 శాతం పనులు పూర్తి కాగా ఏప్రిల్ నెలాఖరుకు పనులు పూర్తవుతాయని వీఎంఆర్‌డీఏ డీఈఈ వీఆర్ రవిశంకర్ తెలిపారు. రహదారి నాణ్యత తనిఖీల్లో వీఎంఆర్‌డీఏ క్వాలిటీ కంట్రోల్ సెల్ డీఈఈలు దుర్గాప్రసాద్, రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎండుగడ్డి వ్యాన్ దగ్ధం



అగ్నికి ఆహుతైన గడ్డిలోడుతో ఉన్న వ్యాన్

మునగపాక : డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఎండుగడ్డి లోడుతో వెళుతున్న వ్యాన్‌కు విద్యుత్ వైర్లు తగలడంతో ప్రమాదం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. మంగళవారం వాడ్రాపల్లి-తిమ్మరాజుపేట మార్గంలో వ్యాన్‌పై ఎండుగడ్డిని తీసుకువస్తున్నారు. రైతు నుంచి కొనుగోలు చేసిన ఎండుగడ్డిని తరలించేందుకు ప్రయత్నించారు. మార్గమధ్యంలో విద్యుత్ వైర్లు గడ్డికి తగలడంతో మంటలు వ్యాపించాయి. పక్కనే పశువుల పాకలు ఉండడాన్ని గమనించిన వ్యాన్ డ్రైవర్ వాహనాన్ని వేగంగా నడిపి పూడిమడక రోడ్డులో వస్తూ ఖాళీ ప్రదేశంలో వాహనాన్ని ఉంచి డ్రైవర్ దూకేశాడు. స్థానికులు ప్రమాద సమాచారాన్ని అగ్నిమాపక సిబ్బందికి ఫోన్ ద్వారా అందజేశారు. దీంతో అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. కాగా పూడిమడక రోడ్డులో కాలిపోతున్న గడ్డితో వస్తున్న వ్యాన్ కారణంగా కొంతసేపు వాహనాలు నిలిచిపోయాయి.

గత ఎన్నికలకు మించి ఓట్లు సాధించాలి



ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగుల్ని సత్కరిస్తున్న సర్పంచ్ గారా ఉష శ్రీ ప్రసాద్



జేవీపాలెంలో నాయకులతో సమావేశమైన ఎమ్మెల్యే కంబాల జోగులు

పాయకరావుపేట : త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే ధ్యేయంగా నాయకులంతా కృషి చేయాలని, అందుకోసం అందరం కలిసికట్టుగా పనిచేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ అన్నారు. స్థానిక సర్పంచ్ గారా ఉష శ్రీ ప్రసాద్ స్వగృహంలో పాయకరావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు పరిచయ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో కన్నా మండలంలోను, పట్టణంలోను పార్టీకి ఎక్కువగా ఓట్లు వేయించుకునే విధంగా విస్తృత ప్రచారం సాగించాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టి, అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలను ఇంటింటికి తీసుకెళ్లి, ప్రతి ఓటును సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగుల్ని సర్పంచ్‌తో పాటు స్థానిక నాయకులకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా జోగులును, బొడ్డేడ ప్రసాద్‌ను సర్పంచ్ గారా ఉష శ్రీ ప్రసాద్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల వ్యవసాయ సలహా మండలి చైర్మన్, పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు, పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, జెడ్పీటీసీ లంక సూరిబాబు, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, గ్రామ ఉపసర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ దేవవరపు రాజేష్ ఖన్నా, పంచాయతీ వార్డు సభ్యులు ధనిశెట్టి బాబి, పిరాధి రాజు, జగతా శ్రీను, కేశనకుర్తి సత్తిబాబు పాల్గొన్నారు.

జేవీ పాలెంలో...

ఎస్.రాయవరం : గ్రామీణ ప్రాంతంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదే అని పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్యే అభ్యర్థి, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. మండలంలో జేవీపాలెం గ్రామంలో మంగళవారం స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన చేశారు. ప్రతి పేదకుటుంబం ఆర్థికంగా బలోపేతంగా కావాలని కోరుతూ అన్ని వర్గాల వారికి మేలు చేకూరే సంక్షేమం అందించడంతో పాటు గ్రామ స్వరాజ్యం దిశగా సచివాలయాలు వ్యవస్థ స్థాపించారన్నారు. మండల స్థాయిలో జరిగే పనులు గ్రామ స్థాయిలో చేపట్టేలా చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోన లోవలక్ష్మి, జెడ్పీటీసీ కాకర దేవి, వైఎస్సార్ మండల పార్టీ అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు, జిల్లా కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కట్టుమూరి చంద్రరావు, శిగిరెడ్డి అప్పారావు, కర్రి సత్యారావు, కట్టుమూరి కృష్ణ, శంకర్రావు, ముసిలినాయుడు పాల్గొన్నారు.

15 మద్యం సీసాలు స్వాధీనం

పరవాడ: మండలంలోని పెదముషిడివాడ గ్రామానికి చెందిన జెన్నారపు త్రినాథ్ మద్యం దుకాణం నుంచి 15 మద్యం సీసాలు(180 ఎంఎల్) కొనుగోలు చేసి అక్రమంగా తరలిస్తుండగా ఎస్ఐ టి.మల్లేశ్వరరావు దాడి చేసి అతన్ని పట్టుకున్నారు.

పాఠశాల శాశ్వత భవనం నిర్మాణానికి కృషి

ఎస్.రాయవరం : లింగరాజుపాలెం మహాత్మా జ్యోతిరావు పూలే పాఠశాల శాశ్వత భవన నిర్మాణం ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేస్తోందని గురుకులాల రాష్ట్ర కార్యదర్శి కృష్ణమోహన్ అన్నారు. మంగళవారం పాఠశాలను ఆకస్మికంగా ఆయన తనిఖీ చేశారు. పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులతో మాట్లాడారు. పరీక్షల్లో మెరుగైన ఫలితాలు వచ్చేలా రాయాలని సూచించారు. ప్రతి రోజూ ఇబ్బందులు లేకుండా పరీక్ష కేంద్రానికి వెళ్లి వస్తున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ఏర్పాటు నుంచి భవనం సదుపాయంగా లేకపోవడంతో వసతి, తరగతులు ఒకే గదిలో నిర్వహిస్తున్నారని, శాశ్వత భవనం లేకపోవడంతో పాఠశాల నుంచి వ్యర్థాలు వెలుపలకు వెళ్లేందుకు సదుపాయాలు లేవని విద్యార్థులు ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. ఈ మేరకు స్పందించిన ఆయన భవనం సమస్యలు ఇప్పటికే ప్రభుత్వం దృష్టిలో ఉందని త్వరలో శాశ్వత భవన నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటారన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పోషక విలువలతో కూడిన ఆహారం శ్రేయస్కరం



మహిళలకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మునగపాక: మహిళలు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని టాటా ట్రస్ట్ ప్రతినిధి భాగ్యలక్ష్మి కోరారు. పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా టాటా ట్రస్ట్ అలాగే ఏసియన్ పెయింట్స్ సహకారంతో మంగళవారం మండలంలోని నాగులాపల్లి అంగన్‌వాడీ కేంద్రాలు-3,4లలో బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా చిరు ధాన్యాలు తీసుకోవాలన్నారు. పుట్టబోయే బిడ్డ ఆరోగ్యకరంగా ఉండాలంటే తల్లులు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పద్మజ, సరస్వతి, ఆశ కార్యకర్తలు శ్రావణి, లక్ష్మి పాల్గొన్నారు.

క్షయ నియంత్రణపై అవగాహన ర్యాలీ



క్షయ వ్యాధి వారోత్సవాల్లో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

కశింకోట:ప్రతి ఒక్కరూ క్షయ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కె.తిరుపతిరావు సూచించారు. క్షయ వ్యాధి వారోత్సవాల్లో భాగంగా ఈ వ్యాధిపై అవగాహన కలిగిస్తూ వైద్య ఆరోగ్య సిబ్బంది మంగళవారం కశింకోటలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగ భేదం, వయస్సుతో సంబంధం లేకుండా క్షయ వ్యాధి గాలి ద్వారా ఒకరి నుంచి మరొకరికి సోకుతుందన్నారు. ఈ వ్యాధి ఊపిరితిత్తులు, ఇతర అవయవాలకు ప్రబలుతుందన్నారు. వ్యాధి నివారణకు ఆరు నెలలపాటు మందులు వాడాల్సి ఉంటుందని, ప్రతి పీహెచ్‌సీలో ఈ మందులు ఉచితంగా లభ్యమవుతాయన్నారు.

గిజగాళ్లకు.. గూడు కడదాం!

- నేడు ప్రపంచ పిచ్చుకల దినోత్సవం
- పిచ్చుకల సంరక్షణలో మేటి గ్రీన్ క్లబ్

చల్లని ఉషోదయాన.. నులి వెచ్చని సూరీడు ప్రకృతిని పలకరిస్తున్న వేళ.. పచ్చని చెట్లపైనుంచి పిచ్చుకలు, ఇతర పక్షుల కిలకిలా రావాలను మించిన హాయిగొలిపే సంగీతం వేరే ఏముంటుంది. ఇంటి ముంగిళ్లలో వేసే ధాన్యం గింజల కోసం కిచకిచమంటూ వచ్చే పిచ్చుకలు, వాటిని తిన్నాక తుర్రుమని ఎగిరిపోతుంటే.. చూస్తూ పొందిన ఆనందానికి విలువ కట్టగలమా? ఇళ్లల్లో ఎక్కడో ఓ చోట చిన్న గూడు కట్టుకుని కిచకిచలాడుతూ అటూ ఇటూ తిరుగుతుంటే దొరికే ప్రశాంతత ఇపుడుందా? నేడు(మార్చి 20) ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన ఆ చిట్టిపొట్టి ప్రాణుల కోసం కాస్త ఆలోచిద్దాం. కాసింత ఆసరాగా నిలుద్దాం.



పిచ్చుక నమూనా

అనకాపల్లి: ఒకప్పుడు పంట చేలల్లో, ఇంటి ముంగిళ్లలో, ధాన్యపు రాశుల్లో కిలకిలమంటూ సందడి చేసే పిచ్చుకలు ప్రస్తుతం కనుమరుగవుతున్నాయి. విస్తరిస్తున్న నగర సంస్కృతి.. అడవులు, పంట చేలు తగ్గి, కాంక్రీట్ జంగిల్ విస్తరిస్తోంది. పెరుగుతున్న సాంకేతికత, కాలుష్యం, రేడియేషన్ ఈ బుల్లి ప్రాణాల పాలిట సంకటంగా మారుతున్నాయి. కాంక్రీట్ నిర్మాణాల మధ్య మనుషుల మనసులు కూడా కరకుదనాన్ని సొంతం చేసుకుంటున్నాయేమో! దీంతో తినడానికి ధాన్యం గింజలు దొరకక, ఉండేందుకు సరైన నీడలేక పిట్టల్లా.. కాదు.. ఈ పిట్టలే రాలిపోతున్నాయి. ఈ చిరు ప్రాణుల సంరక్షణలో కృషి చేస్తున్న వారూ ఉన్నారు.

అంతరిస్తున్న పిచ్చుకలు

రాష్ట్ర వ్యాప్తంగా పిచ్చుకలకు చెందిన 450 జాతుల్లో ప్రస్తుతం 40 జాతులు మాత్రమే ఉన్నట్లు పక్షి ప్రేమికులు చెప్తున్నారు. మనిషి తన స్వార్థ ప్రయోజనాల కోసం చేస్తున్న కాలుష్యం, సాంకేతికత ప్రభావం పిచ్చుకల పాలిట పెనుశాపంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిచ్చుకలు జీవావరణంలో చేసే మేలు అంతా ఇంతా కాదని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెప్తున్నారు. పంటలకు నష్టాన్ని కలుగజేసే క్రిమికీటకాలను ఆహారంగా తీసుకుని, పంటలను చీడపీడల నుంచి రక్షించే రైతు మిత్రులుగా వీటిని పేర్కొంటారు. అందుకే రైతులు తమ పంట చేతికి వచ్చేటపుడు కొన్ని వరి కంకులను చుట్టగా కట్టి, ఇంటి చూరుకు వేలాడదీస్తారు. ఇపుడు పూరిళ్లూ కనుమరుగవుతున్నాయి. వ్యవసాయం కూడా హానికర పురుగు మందుల వినియోగంతో, పిచ్చుకల మనుగడను హరిస్తోంది.



నెహ్రూచౌక్‌లో పంపిణీకి గ్రీన్ క్లబ్ సిద్ధం చేసిన మట్టిపాత్రలు, నీటి సీసాలు(ఫైల్)

పిచ్చుకల మనుగడ కోసం

ఏటా ప్రపంచ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొణతాల ఫణిభూషణ్ తన సొంత నిధులతో పక్షులకు గూళ్లలో అమర్చడానికి మట్టి పాత్రలు, ధాన్యపు కురాసులు ఉచితంగా పంపిణీ చేస్తుంటారు. దేవాలయాలు, పార్కులు, పాఠశాల ఆవరణల్లో వీటిని ఏర్పాటు చేస్తూ, ప్రజలకు ఉచితంగా అందిస్తారు. కరపత్రాల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. యువతను పిచ్చుకల సంరక్షణ దిశగా పలు కార్యక్రమాల ద్వారా సమాయత్తం చేస్తున్నారు. చేయి చేయి కలుపుదాం- పిచ్చుకల సంతతిని సంరక్షిద్దాం, తిండి గింజలు, కాసిన్ని నీళ్లు పక్షులకు అందిద్దాం-మనతో పాటు చిన్ని పక్షుల్ని బతికిద్దాం అంటూ ప్రజల్ని చైతన్య పరుస్తున్నారు.

గంజాయితో ముగ్గురి అరెస్ట్

- 32 కిలోల గంజాయి స్వాధీనం
- నిందితులు అల్లూరి జిల్లాకు చెందిన వారిగా గుర్తింపు



పట్టుబడిన గంజాయితో డీఎస్పీ సత్యనారాయణ, సీఐ రమణ, ఎస్ఐ ధనుంజయ్

సబ్బవరం: మండలంలోని అనకాపల్లి-ఆనందపురం జాతీయ రహదారిపై అసకపల్లి ఫ్లై ఓవర్ వద్ద ఆటోలో తరలిస్తున్న 32 కిలోల గంజాయిని సబ్బవరం పోలీసులు పట్టుకున్నారు. సబ్బవరం పోలీస్ స్టేషన్‌లో పరవాడ డీఎస్పీ సత్యనారాయణ మంగళవారం సీఐ పిన్నంటి రమణతో కలిసి వివరాలు వెల్లడించారు. సబ్బవరం ఎస్ఐ ధనుంజయ్‌కు వచ్చిన ముందస్తు సమాచారం మేరకు ఆయన సిబ్బందితో కలసి జాతీయ రహదారిపై తనిఖీలు నిర్వహించి ఆటోలో తరలిస్తున్న 16 ప్యాకెట్లలోని 32 కిలోల గంజాయిని పట్టుకున్నారు. ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి నుంచి రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని ఆటోను సీజ్ చేసినట్లు తెలిపారు.పట్టుబడిన గంజాయి విలువ రూ.1.60 లక్షల వరకూ ఉంటుందన్నారు. గంజాయి అక్రమ రవాణాకు పాల్పడిన కిల్లోస్ గిరిబాబు, వంతల చంటి బాబు,వంతల కోటేశ్వరరావులను అదుపులోకి తీసుకోగా మరో వ్యక్తి పరారైనట్లు తెలిపారు. పట్టుబడిన వ్యక్తులంతా అల్లూరి జిల్లాలోని చింతపల్లి ప్రాంతానికి చెందిన వారిగా గుర్తించామన్నారు. వీరు చింతపల్లి ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తి నుంచి గంజాయి తీసుకుని సబ్బవరం మీదగా తుని తరలిస్తున్నట్లు తెలుస్తుందన్నారు. పట్టుబడిన వ్యక్తులను కోర్టులో ప్రవేశ పెడతామని ఈ సందర్భంగా డీఎస్పీ తెలిపారు.

రివార్డుల కోసం సిఫార్సు : ఏజెన్సీకి సబ్బవరం ప్రాంతం ముఖద్వారం గంజాయి రవాణాకు నిందితులు ఈ మార్గాన్ని ఎంచుకుంటున్నారని డీఎస్పీ సత్యనారాయణ తెలిపారు. సీఐ పిన్నంటి రమణ,ఎస్ఐ ధనుంజయ్ గంజాయి అక్రమ రవాణాకు చెక్ పెట్టడంలో విశేషంగా కృషి చేస్తున్నారన్నారు. వీరికి రివార్డుల కోసం ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామన్నారు. సమావేశంలో ఎస్ఐ ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.